క్లుప్తంగా

పార్టీ అధినేత జగన్‌ను కలసిన గీత



తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన వంగా గీత

పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రస్తుతం ఆపద్ధర్మ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం ఆ పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జగన్‌ను కలిసి నియోజకవర్గంలో పరిస్థితులను ఆయనకు వివరించారు.

13న పాఠశాలల పునః ప్రారంభం

గొల్లప్రోలు: మండలవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఈ నెల 13వ తేదీన పునః ప్రారంభించనున్నట్లు ఎంఈఓ–2 దుర్గాప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పాఠ్య, నోట్ పుస్తకాలు అన్ని పాఠశాలలకు చేరాయన్నారు. పాఠశాలలు తెరిచిన తర్వాత తరగతుల వారీగా విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తామని తెలిపారు.

రేపు దేవస్థానం భూములకు కౌలు వేలం

గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలు సీతారామస్వామి దేవస్థానం భూములకు బుధవారం కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జి.అశ్విని సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు చేబ్రోలు సీతారామస్వామి ఆలయంలో దేవదాయశాఖ అధికారులు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దామెర వెంకట దివాకర్ సమక్షంలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



చేబ్రోలులో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తులసి

గొల్లప్రోలు: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తులసీ సూచించారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 25 మంది గర్భిణులకు డాక్టర్ తులసి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు ఆకుకూరలు, పాలు, పండ్లు, కోడి గుడ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొత్తపల్లి: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై స్వామినాయుడు సూచించారు. ఉప్పాడ– కాకినాడ బీచ్ రోడ్డులో యువతకు సోమవారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువత మృత్యువాత పడుతున్నారన్నారు. మద్యం, మత్తు పదార్థాలు తీసుకుని డ్రైవింగ్ చేయడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తీర ప్రాంతాల్లో సేద తీరే పర్యాటకులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన తీర ప్రాంతాల్లో స్నానాలు చేయరాదని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుష్మ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఈ సీజన్‌లో జ్వరం , వాంతులు, విరోచనాలు వంటి వ్యాధులు ఎక్కువగా సోకుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిల్లలకు దోమ తెరలు తప్పనిసరిగా వాడాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడిగా ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వేటకు వేళాయె..

- ఈ నెల 14 నుంచి సముద్రంలో చేపల వేట ప్రారంభం
- సిద్ధమవుతున్న మత్స్యకారులు
- కడలి వద్దకు చేరుతున్న బోట్లు
- మండలంలో 8000 మత్స్యకార కుటుంబాలు

కొత్తపల్లి: సముద్రంలో చేపల వేటకు సమయం ఆసన్నమైంది. కడలిలో వేట నిషేధ సమయం ఈ నెల 13తో ముగుస్తోంది. 14వ తేదీ అర్ధరాత్రి నుంచి చేపల వేట ప్రారంభం కానుంది. కాగా మత్స్యకారులు నాలుగు రోజుల ముందు నుంచే చేపల వేటకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటివరకూ విశ్రాంతి తీసుకున్న బోట్లు చేపల వేట కోసం సాగర తీరానికి చేరాయి. సుమారు రెండు నెలల పాటు ఇళ్లకే పరిమితమైన మత్స్యకారులు కడలిలో కాలుమోపనున్నారు.

మండలంలో 1100 బోట్లు

కొత్తపల్లి మండలంలో మత్స్యకార గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. మండలంలో సుమారు 1100 బోట్లపై ఆధారపడి 8000 మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వేట నిషేధం కారణంగా సుమారు రెండు నెలల పాటు సాగర తీరం బోసిపోయింది. ప్రస్తుతం వేట నిషేధ సమయం ముగుస్తుండటంతో తీరం మత్స్యకారులతో సందడిగా మారనుంది. దూర ప్రాంతాలకు వెళ్లి వేట సాగించే మత్స్యకారులు అన్ని సౌకర్యాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే బోట్లను సాగరంలో లంగరు వేశారు. వేట నిషేధం ముగిసిన మరుక్షణం చేపల వేటకు వెళ్లేందుకు రెడీ అయ్యారు. కొందరు ముహూర్తాలు చూసుకుని వేటకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

తీరంలో సందడి

మరో రెండు రోజుల్లో సముద్రంలో వేట నిషేధం ముగియనుండగా సోమవారం నుంచే సాగర తీరంలో సందడి ప్రారంభమైంది. 45 రోజుల విరామం అనంతరం సముద్రంపై చేపల వేట గురువారం అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానుంది. సముద్రంలో మత్స్యసంపదను పెంచేందుకు ప్రభుత్వం 45 రోజుల పాటు వేటను నిషేధించింది. తెరచాప తెప్పలు తప్ప మిగిలిన అన్ని బోట్లుపై నిషేధం విధించారు. దీంతో గత 45 రోజులుగా మత్స్యకారులు జీవనోపాధికి దూరమయ్యారు. గతంలో నిషేధాన్ని ఉల్లంఘిస్తూ అక్కడక్కడ కొందరు మత్స్యకారులు అడపాదడపా చేపల వేట సాగించడం, వారిపై అధికారులు దాడిచేసి అపరాధ రుసుము వసూలు చేయడం జరిగాయి. కాని ఈ ఏడాది చేపల వేట నిషేధన్ని మత్స్యకారులు స్వచ్ఛందంగా అమలు చేశారు.

వలలు, బోట్లు సిద్ధం

వేట నిషేధం కావడంతో సురక్షిత ప్రాంతాల్లో ఉంచిన వలలు, ఉప్పుటేర్లలో లంగరు వేసిన బోట్లను సోమవారం మత్సకారులు సముద్ర తీరానికి చేర్చారు. కొత్తగా తయారు చేసిన బోట్లను సైతం పొక్లెయిన్ సాయంతో తీసుకు వచ్చి సముద్రంలో లంగరు వేశారు. బోట్లలో డీజిల్, వంట, వేట సామగ్రిని సిద్ధం చేసుకున్నారు. గత 45 రోజులుగా ఖాళీగా ఉన్న మత్సకారులు బోట్లు, వలలకు మరమ్మతులు చేసుకున్నారు. వేట నిషేధం ముగుస్తుండటంతో చేపల వ్యాపారుల సైతం తమ వ్యాపారం ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరో మూడు రోజుల్లో సాగర తీరం చేపల వేట, క్రయవిక్రయాలతో మళ్లీ కలకలలాడనుంది.



సముద్రంలో వేటకు వెళ్లేందుకు బోట్లను సిద్ధం చేస్తున్న మత్స్యకారులు



సురక్షిత ప్రాంతాల నుంచి సముద్ర తీరానికి చేరిన బోట్లు



చేపల ఎగుమతి కోసం తీరానికి చేరిన వాహనాలు

కార్పొరేట్ స్కూళ్లలో ఫీజులు నియంత్రించాలి



జగ్గంపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సతీష్

జగ్గంపేట: కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి కె.సతీష్ కోరారు. జగ్గంపేటలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు తరగతులు ప్రారంభించాయన్నారు. పుస్తకాలు, యూనిఫాం పేరుతో నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సంవత్సరానికి అన్ని రకాల ఫీజులు కలిపి రూ.24 వేలు మించకూడదని ప్రభుత్వ నిబంధన ఉన్నా ప్రైయివేట్ పాఠశాలల యాజమాన్యాలు దీనిని పట్టించుకోవడం లేదన్నారు. డొనేషన్లు, కాంపిటేషన్ల పేరుతో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కొత్త ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని కోరారు. గుర్తింపులేని విద్యాసంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నేతలు రాము, అర్జున్, సురేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యత్వానికి భామిరెడ్డి రాజీనామా

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యత్వానికి కర్రి భామిరెడ్డి (కాకినాడ) సోమవారం రాజీనామా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మారడంతో ఆయన రాజీనామా చేసినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. దేవస్థానం ధర్మకర్తల మండలికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఐవీ రోహిత్ చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా ఏడుగురు మహిళలతో సహా 15 మంది సభ్యులను 2023 మార్చి నెలలో రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వీరి పదవీ కాలం 2025 మార్చి వరకూ ఉంది.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



ఏలేశ్వరంలో దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న సేవాశ్రమం ప్రతినిధులు

ఏలేశ్వరం: పట్టణంలోని దివ్యాంగులకు సోమవారం ఉచితంగా నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. స్థానిక క్వారీపేటలోని వికలాంగ, వయోవృద్ధుల సేవాశ్రమంలో 20 మంది దివ్యాంగులకు సేవాశ్రమం జిల్లా అధ్యక్షురాలు అంజూరి రాజకుమారి నిత్యావసరాల కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు ఇవ్వాలన్నారు. తమ సంస్థ ద్వారా ప్రతినెలా దివ్యాంగులకు ఉచితంగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గణపతి, యేసు, శ్రీను, సత్యం, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాలపై విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరాంజనేయులు

పెద్దాపురం: ఇటీవల విడుదలైన నీట్ పరీక్షా ఫలితాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని పులిమేరులో సోమవారం ఏర్పాటు చేసిన రైతు కూలీ సంఘ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసిన నీట్ పరీక్షా ఫలితాలపై పలు సందేహాలున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720/720 మార్కులు రావడం, వీటిలో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కు చెందిన వారు కావడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై పలు అనుమానాలు ఉన్నాయని, తక్షణమే ఎన్‌టీఏ విడుదల చేసిన నీట్ ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి, మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరారు. ఈ ఏడాది ఎన్‌టీఏ విడుదల చేసిన నీట్ పరీక్షా ఫలితాలపై, పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వల్లూరి రాజుబాబు, దేశెట్టి సురేష్, కడితి సతీష్, నారాయణమూర్తి, బీడీల నాగేశ్వరరావు, ఏసు, శివాజీ, భూషణం, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువుల తిష్ట.. పరాకాష్ఠ

- ఎక్కడ చూసినా రహదార్లపై పశువులే..
- ప్రమాదాలకు కారణమవుతున్న వైనం
- రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించాలంటున్న ప్రజలు



బ్రౌన్‌పేటలో రోడ్డుపై తిష్ట వేసిన పశువులు

సామర్లకోట: రోడ్లపై ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా పశువులు కనిపిస్తున్నాయి. వీటివల్ల వాహన చోదకులు అనేక ప్రమాదాలకు గురైన దాఖలాలూ ఉన్నాయి. రాత్రి వేళ వీటి గుంపులు మరింత ఎక్కువగా ఉండటంతో, భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. బ్రౌన్‌పేట, పాత తహసీల్దార్ కార్యాలయం, స్టేషన్ సెంటర్, మఠం సెంటర్, మెహర్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో పశువులు రోడ్లపైనే తిష్ట వేస్తున్నాయి. రోడ్లపై బైఠాయిస్తున్న పశువులను నియంత్రించాలని మానవ హక్కుల సంఘ నాయకులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పాలు ఇవ్వని ఆవులను వాటి యజమానులు రోడ్లపై విడిచి పెడుతున్నారనే విమర్శలున్నాయి. రోడ్లపైనే ఉంటున్న పశువులను అదుపులోకి తీసుకొనే అధికారం మున్సిపాలిటీకి ఉంది.

ఆక్రమణలో బందెల దొడ్డి

మున్సిపాలిటీ పరిధిలో అదుపులోకి తీసుకున్న పశువులను బందెల దొడ్డిలో ఉంచాలి. పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉండే బందెలదొడ్డి ఆక్రమణకు గురైంది. రోడ్లపై పశువుల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని అనేక మంది మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకు రావడంతో, మైక్ ద్వారా ప్రచారం చేసి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రోడ్లపై పశువులు లేకుండా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అనేక సార్లు ఫిర్యాదులు చేశాం



రోడ్లపై బైఠాయిస్తున్న పశువులను నియంత్రించాలని అనేక పర్యాయాలు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశాం. పశువుల యజమానులతో సమావేశం నిర్వహించి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. రోడ్లపై పశువుల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– నూతలపాటి అప్పలకొండ, మానవహక్కుల సంఘ అధ్యక్షుడు, సామర్లకోట

చర్యలు తీసుకుంటాం



రోడ్లపై బైఠాయిస్తున్న పశువులకు సంబంధించి మైక్ ద్వారా ప్రచారం చేసినా, పశువుల యజమానులు స్పందించకపోతే చర్యలు తీసుకుంటాం. పశువులపై చర్యలు తీసుకునే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో, ఎటువంటి చర్యలు తీసుకోలేకపోయాం. ప్రజల మేలు కోసమే మున్సిపాలిటీ పని చేస్తుంది.

– జె రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వాలి



బహుమతులు అందుకున్న విజేతలతో నిర్వాహకులు



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

పెద్దాపురం: ఉరిమే ఉత్సాహం బాలలకే సొంతమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్, చేనేత సొసైటీ అధ్యక్షుడు ముప్పన వీర్రాజు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్(పీసీసీ) ఆధ్వర్యంలో 34 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ సోమవారం పీసీసీ కన్వీనర్ కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా స్టాలిన్, వీర్రాజు మాట్లాడుతూ పిల్లల ప్రపంచం చాలా ఆనందమైందని, వారికి స్వేచ్ఛనివ్వాలన్నారు. చదువు, ఆటపాటలు, సైన్స్ ప్రయోగాలు చెప్పడంతో వేసవి శిబిరంలో మంచి ఉత్సాహం చూపించారన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జ్యోస్యుల కృష్ణబాబు మాట్లాడుతూ వేసవిలో చల్లటి ఆహ్లాదకర వాతావరణంలో మంచి శిక్షణ ఇచ్చిన పీసీసీ కమిటీని అభినందించారు. పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ గంగాధరుడు, ప్రముఖ డాక్టర్ జమ్మి శిరీష, నరేష్ పెద్దిరెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం వేసవి శిక్షణలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధులు జి.ప్రభాకరవర్మ, బేబీరత్నం, రొంగల అరుణ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కాకినాడ గోశాలలకు పశుగ్రాసం



హుస్సేన్‌పురం నుంచి వాహనంలో గడ్డిని తరలిస్తున్న యువకులు



కాకినాడ గోశాలలో పశువులకు గడ్డి వేస్తూ..

సామర్లకోట: మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన యువకులు కాకినాడ గోశాలకు పశుగ్రాసం సరఫరా చేశారు. గోశాలలో పశువులకు పచ్చగడ్డి కొరత ఏర్పడడంతో, గోశాల నిర్వాహకులు హుస్సేన్‌పురం గ్రామంలోని యువకులకు సమాచారమిచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని పొలంలో పచ్చగడ్డి కోసి, ఆ యువకులు కాకినాడలోని గోశాలకు తరలించారు. గ్రామానికి చెందిన చల్లా బుజ్జిబాబు ఆధ్వర్యంలో యువకులు గడ్డి కోసి వాహనంపై తీసుకువెళ్లి, గోశాలలోని పశువులకు వేశారు.

15న మండల సమావేశం

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయమాధవి సోమవారం తెలిపారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మండల అభివృద్ధిపై చర్చిస్తారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి



గోకవరంలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్య ప్రముఖులు

గోకవరం: ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సీఎండీకేఏ స్పీవీ పినన్స్ లే అవుట్‌లో సోమవారం కాకినాడకు చెందిన శ్రీకిరణ్ కంటి ఆస్పత్రికి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్లు సుమారు 100 మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు ఈ కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో అన్ని రకాల వ్యాధులకు సంబంధించి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కుల మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు, పలు ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఇదే స్ఫూర్తితో తాను త్వరలో బీజేపీలో చేరనున్నట్టు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో కిరణ్ కంటి ఆస్పత్రి డాక్టర్ స్వరూపారాణి, సిబ్బంది రమాసత్యనారాయణ, రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్నదొర, తామర్ల రాంబాబు, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాథశర్మ తదితరులు పాల్గొన్నారు.